కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్. రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు

హైదరాబాద్‌ను యూటీ చేసే కుట్ర!

కేంద్రపాలిత ప్రాంతంగా మార్చే ప్రమాదం

- పార్లమెంట్‌లో బీఆర్ఎస్ లేకుంటే రాజధాని లేకుండా చేస్తరు
- ఉమ్మడి రాజధాని గడువు తీరితే రాష్ట్రానికి అన్యాయం ఖాయం
- నదుల అనుసంధానం పేరిట తెలంగాణను ఎండబెడుతరు
- పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ప్రాతినిధ్యం లేకుండా చేస్తరు
- ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లు తీసేస్తరు.. రాజ్యాంగాన్ని మార్చేస్తరు
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కరీంనగర్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు బలమైన ప్రాతినిధ్యం లేకుంటే బీజేపీ, కాంగ్రెస్ వంటి జాతీయ పార్టీలు హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా ప్రకటిస్తాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం వేములవాడ, మానకొండూర్, కరీంనగర్ నియోజకవర్గాల్లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశాల్లో, చొప్పదండిలో రోడ్‌షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ప్రసంగించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్ ఎందుకు ఉండాలనే దానిపై స్పష్టత ఇచ్చారు. వచ్చే జూన్ 2 నాటికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేండ్లు నిండుతాయని, అప్పటి వరకు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు తీరుతుందని గుర్తుచేశారు. హైదరాబాద్‌ను కేంద్ర పాలిత ప్రాంతం చేయటానికి కుట్రలు జరుగుతున్నాయని హెచ్చరించారు. అలా జరగొద్దు అనుకుంటే.. బీఆర్ఎస్‌కు పార్లమెంట్‌లో గట్టి బలం ఉండాలని కేటీఆర్ స్పష్టం చేశారు. అంతే కాకుండా ఓట్ల కోసం మన అవసరాలు తీరకుండానే గోదావరి జలాలను తమిళనాడు, కర్ణాటకకు తరలించేలా కావేరి నదితో అనుసంధానం చేయాలని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తున్నదని ఆరోపించారు. తెలంగాణలో ఒక్క ప్రాజెక్టుకు కూడా జాతీయ హోదా ఇవ్వని బీజేపీ.. తెలంగాణను ఎండబెట్టి ఇతర రాష్ట్రాలకు తీసుకెళ్లాలని చూస్తున్నదని చెప్పారు. 2026లో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్, అసెంబ్లీ సీట్లను పునర్విభజన చేస్తుందని, కొన్ని కొత్త నియోజకవర్గాలను ఏర్పాటు చేస్తారని, ఆ సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో జనాభా ఎక్కువ, దక్షిణాది రాష్ట్రాల్లో తక్కువని చెప్పి దక్షిణాదికి తక్కువ నియోజకవర్గాలు ఏర్పాటు చేసే ప్రమాదం ఉన్నదని, అందుకే పార్లమెంట్‌లో కొట్లాడేందుకు బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని తెలిపారు. తమకు మూడింట రెండో వంతు మెజార్టీ ఇస్తే ఎస్టీ, ఎస్టీల రిజర్వేషన్లు తొలగిస్తామని బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని, రాజ్యాంగాన్ని మార్చేస్తామని చెప్తున్నారని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు బీఆర్ఎస్ ఎంపీలు ఉండాలని వెల్లడించారు. బీజేపీకి ఓటు వేస్తే వ్యవసాయ బావుల కాడ మోటర్లకు మీటర్లు పెట్టుడు పక్కా అని తెలిపారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు ఆపారని, రేవంత్‌రెడ్డికి అంత దమ్ము లేదని స్పష్టం చేశారు. ఆయన మీద కేసులు ఉన్నాయని, మోదీ బెదిరిస్తే భయపడతాడని ఎద్దేవా చేశారు.

బడేభాయ్, చోటాభాయ్ కలిసి రాష్ట్రానికి మోసం

2014లో బడేభాయ్ నరేంద్రమోదీ మోసం చేస్తే, 2023లో చోటాభాయ్ రేవంత్‌రెడ్డి రాష్ట్ర ప్రజలను మరింత మోసం చేశారని కేటీఆర్ ధ్వజమెత్తారు. జనధన్ ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ చెప్పారని, పదేండ్లలో 20 కోట్ల ఉద్యోగాలు వచ్చాయా? అన్ని ప్రశ్నించారు. చోటాభాయ్ రేవంత్‌రెడ్డి కూడా అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నిలబెట్టుకోలేని బీజేపీ, కాంగ్రెస్‌కు ఎందుకు ఓటెయ్యాలని ప్రశ్నించారు. ప్రధాని మోదీ పేద, మధ్య తరగతి ప్రజలను వంచించారని, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు విపరీతంగా పెంచారని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ మీద ప్రత్యేక సుంకం వసూలు చేసి, టోల్ ట్యాక్స్ ఎందుకు వసూలు చేస్తున్నారని మోదీని ప్రశ్నించారు. పదేండ్ల పాలనలో హిందూ, ముస్లిం అనే విషాన్ని ప్రజల్లో నింపారని ధ్వజమెత్తారు. 'ఉంటే నా జేబులో ఉండు.. లేదంటే జైల్లో ఉండు' అన్న చందంగా మోదీ పాలన సాగుతున్నదని ఆరోపించారు. ఈ విధానాలు నచ్చని కేసీఆర్ గట్టిగా కొట్లాడితే ఆయన బిడ్డను తీసుకెళ్లి జైల్లో పెట్టారని, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను జైలుకు పంపించారని గుర్తుచేశారు. మమతా బెనర్జీ, స్టాలిన్‌పైనా కేసులు పెట్టారని వెల్లడించారు.

మోదీకి ఓటెందుకేయాలి?

తెలంగాణ పుట్టుకను అవమానించిన ప్రధాని మోదీకి వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ఎందుకు వేయాలి? అని కేటీఆర్ ప్రశ్నించారు. మనల్ని అడగకుండానే భద్రాద్రిలో ఐదు మండలాలను ఆంధ్రాలో కలిపేశారని, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీ, సిరిసిల్ల టెక్స్‌టైల్ క్లస్టర్లు, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీలో ఏ హామీని నెరవేర్చలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌కు ఉన్న ఐటీఐఆర్‌ని కూడా ఎత్తివేసిందని తెలిపారు. శ్రీరాముడు అందరివాడని, ఎమ్మెల్యే, ఎంపీ కాదని, మంచిపని చేసేవాళ్లకే అధికారం ఇవ్వాలని ఆయన చెప్పారని కేటీఆర్ గుర్తుచేశారు. బండి సంజయ్ వేములవాడ రాజన్న, కొండగట్టు అంజన్న, ఇల్లందకుంట సీతారామస్వామి, సిరిసిల్ల మార్కండేయ ఆలయాలకు ఒక్క రూపాయైనా కేంద్రం నుంచి తెచ్చారా? అని ప్రశ్నించారు. వినోద్‌కుమార్ లాంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉంటేనే కాంగ్రెస్, బీజేపీతో కొట్లాడుతారని స్పష్టం చేశారు. పార్లమెంట్ పరిధిలో ఏ ఊరిలోనైనా బండి వేసిన శిలాఫలకం ఉన్నదా? అని ప్రశ్నించారు. అల్గునూర్‌లోని లక్ష్మీనరసింహ గార్డెన్‌లో ఒకవైపు బండి, మరో వైపు వినోద్‌కుమార్‌ను నిలబెట్టి కరీంనగర్ నియోజకవర్గానికి ఎవరు ఏం చేశారో చెప్పిద్దాన్నారు. వారు చెప్పిన విషయాలను బట్టి ప్రజలను తీర్పు అడుగుదామన్నారు.

కాంగ్రెస్, బీజేపీ మ్యాచ్ ఫిక్సింగ్

కరీంనగర్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్, బీజేపీది మ్యాచ్ ఫిక్సింగ్ అని కేటీఆర్ విమర్శించారు. కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థిని తిప్పాపూర్ బస్టాండ్ వద్ద కండువా తీసి నిలబెడితే ఆ పార్టీ కార్యకర్తలు కూడా గుర్తుపట్టలేరని ఎద్దేవా చేశారు. నిజానికి కరీంనగర్‌లో జీవన్‌రెడ్డి లేదా ప్రవీణ్‌రెడ్డి వంటి నాయకులు పోటీ చేయాల్సి ఉండేదని, వీరిద్దరైతే గట్టిపోటీ ఇస్తారని సీఎం రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ కలిసి డమ్మీ అభ్యర్థిని ఎంపిక చేశారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డివి చిల్లర మాటలు, ఉద్దెర పనులు అని విమర్శించారు.

బీఆర్ఎస్‌కే ప్రజా బలం

రాష్ట్రంలో ప్రజా బలం బీఆర్ఎస్‌కే ఉన్నదని, పార్లమెంట్ ఎన్నికల్లో 12 సీట్లు గెలుచుకుంటే ఏడాది కాలంలో కేసీఆర్ దేశరాజకీయాలను శాసించే స్థాయికి వస్తారని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌కు అన్ని వర్గాల ప్రజలు అనుకూలంగా ఉన్నారని, ఇప్పుడు మనం గట్టి పునాది వేసుకుంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలకు మంచి అవకాశం ఉంటుందని అన్నారు. జూన్ 4 తర్వాత గెలిచిన ఎంపీలు.. ఎమ్మెల్యేలు లేని చోట ఎమ్మెల్యేగా పని చేస్తారని, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటారని స్పష్టం చేశారు.

70 ఏండ్ల వయసులోనూ కష్టపడుతున్న కేసీఆర్

70 ఏండ్ల వయసులో, తొంటి ఎముక విరిగినా.. పార్టీ అధినేత కేసీఆర్ బస్సుయాత్రతో ప్రజల వద్దకు వచ్చి ప్రచారం చేస్తూ కష్టపడుతున్నారని కేటీఆర్ తెలిపారు. 12 బీఆర్ఎస్ సీట్లు గెలిపిస్తే రాష్ట్ర రాజకీయాలను శాసించే రోజు ఏడాదిలోపే వస్తుందని కార్యకర్తలకు ధైర్యాన్ని నింపారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్‌రెడ్డి, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, మాజీ ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, భానుప్రసాద్‌రావు, మేయర్ సునీల్‌రావు, వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, జీవీ రామకృష్ణారావు, తోట ఆగయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేతన్నల ఆత్మహత్యలు కాంగ్రెస్ హత్యలే

- వాటికి రేవంత్ సర్కారే బాధ్యత వహించాలి
- పేరుకపోయిన వస్త్రాలను కొనుగోలు చేయాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ డిమాండ్

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జరుగుతున్న నేతన్నల ఆత్మహత్యలన్నీ కాంగ్రెస్ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎల్ రమణ స్పష్టం చేశారు. వాటికి కాంగ్రెస్ ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్‌చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నేతన్నల ఆత్మహత్యలు మళ్లీ ప్రారంభమయ్యాయని తెలిపారు. గత డిసెంబర్ నుంచి పది వేల కుటుంబాలకు పని లేకుండా పోయిందని చెప్పారు. నేతన్నల వద్ద పేరుకపోయిన వస్త్రాలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ నేత ఎంఎన్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. దేశంలో వ్యవసాయం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే రంగం టెక్స్‌టైల్ అని తెలిపారు. చేనేత పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోవడానికి రేవంత్ సర్కార్ కారణమని ఆరోపించారు. ఎమ్మెల్సీగా తాను రాష్ట్ర మంత్రి తుమ్మల దృష్టికి చేనేతల సమస్య తీసుకెళ్లానని, తమ సూచనలు పట్టించుకొని ప్రభుత్వం స్పందించి ఉంటే నేతన్న ఆత్మహత్యలు జరిగేవి కావన్నారు. నేతన్నలకు వర్క్ ఆర్డర్ పెంచాలని, బకాయిలు చెల్లించాలని, కేసీఆర్ హయాంలో ప్రకటించిన పథకాలు కొనసాగించాలని డిమాండ్ చేశా రు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వస్త్ర పరిశ్రమపై జీఎస్టీ ఎత్తివేస్తామని భారత్ జోడో యాత్రలో రాహుల్‌గాంధీ చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నేతన్నలు ఆత్మస్థైర్యంతో ఉండేలా బతుకమ్మ, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చిందని గుర్తుచేశారు. చేనేతలకు నెలకు రూ.2 వేలు, అనుబంధ పనులు చేసే వారికి మరో రూ.1000 పింఛన్ ఇచ్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. నేతన్న బీమా పథకం ద్వారా చేనేతల కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థికసాయం చేశారని తెలిపారు.

బీఆర్ఎస్సే తెలంగాణకు శ్రీరామరక్ష

- లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీనే గెలిపించండి
- బ్రిటన్‌లో బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణ ప్రయోజనాలకు శ్రీరామరక్ష అని బ్రిటన్‌లోని బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం నాయకులు పేర్కొన్నారు. మేలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులనే గెలిపించాలని వారు పిలుపునిచ్చారు. లండన్‌లోని రీడింగ్ పట్టణంలో బీఆర్ఎస్ ఎన్నారై యూకే కార్యాలయంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం జరిగింది. పార్టీ రీడింగ్ పట్టణ ఇన్‌చార్జి, బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం కార్యదర్శి మల్లారెడ్డి బీరం అధ్యక్షతన ఈ కార్యక్రమం జరింగింది. ఈ సందర్భంగా ఆ విభాగం ఉపాధ్యక్షుడు నవీన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ సమయంలో మొదటిసారి ఖండాంతరాల్లో లండన్ గడ్డపై గులాబీ జెండాను ఎగురవేశామని తెలిపారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సారథ్యమే రాష్ట్రానికి ప్రయోజనం అని ఆనాడు తాము విజ్ఞప్తి చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అప్పుడూ, ఇప్పుడూ తెలంగాణ ప్రయోజనాల కోసం కట్టుబడి చిత్తశుద్ధితో పోరాటం చేసే సత్తా బీఆర్ఎస్ పార్టీకి, కేసీఆర్‌కు మాత్రమే ఉన్నట్టు తెలిపారు. బీఆర్ఎస్ గెలుపు.. ప్రజల గెలుపే అవుతుందని చెప్పారు. కేసీఆర్ నాయత్వానికి బలం ఇస్తేనే తెలంగాణకు మేలు జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎన్నారై యూకే విభాగం ప్రధాన కార్యదర్శి రత్నాకర్ కడుదుల, అడ్వైజరీ బోర్డు సభ్యులు దొంతుల వెంకట్‌రెడ్డి, అధికార ప్రతినిధులు హరిగౌడ్ నవాబుపేట్, రవికుమార్ రత్తినేని, రవిప్రదీప్ పులుసు, సురేశ్ బుడగం, సత్య చిలుముల, సతీశ్‌రెడ్డి బండ, సత్యపాల్‌రెడ్డి పింగిళి, శ్రీకాంత్ జెల్ల, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి

- ఎన్నారై బహ్రెయిన్ శాఖ పిలుపు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ఎన్నారై బహ్రెయిన్ శాఖ అధ్యక్షుడు రాధారపు సతీశ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం రాధారపు సతీశ్‌కుమార్ అధ్యక్షతన బహ్రెయిన్‌లోని అండాలస్ గార్డెన్‌లో కార్యవర్గసభ్యులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో పదేండ్లు కరువులేదని, జలాశయాలు నిండుగా ఉన్నాయని గుర్తుచేశారు. కాంగ్రెస్‌పాలనలో నాలుగు నెలలకే కరువును చూస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మార్పు తెస్తామంటే నమ్మి అధికారం అప్పగిస్తే పాలన చేతగాక కాంగ్రెస్ నేతలు చిల్లర మాటలతో కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మండిపడ్డారు. తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలు రాష్ట్ర సమస్యలపై ఏనాడూ కేంద్రాన్ని నిలదీసిన పాపాన పోలేదన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ సర్కార్ ప్రజలను మోసం మోసగించిందని ధ్వజమెత్తారు. సమావేశంలో ఎన్నారై బీఆర్ఎస్ సెల్ ఉపాధ్యక్షుడు బొలిశెట్టి వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి పుప్పాల బద్రి, అన్నారం సుమన్, కార్యదర్శులు చెన్నమనేని రాజేందర్, బొలిశెట్టి ప్రమోద్, చిలుకూరి రాజలింగం, మరుపాక దేవయ్య, తిప్పారవేణి శ్రీనివాస్, మెరుగు శ్రీనివాస్, కొందరి రాజేందర్, పెనుగొండ శ్రీకాంత్, కోటగిరి శ్రీనివాస్, స్వామి ఉన్నారు.

పోలింగ్ సమయంపైనా వివక్షే!

- ఇతర రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
- తెలంగాణలో 5 గంటలకే ముగించాలట!
- మండుటెండలోనే ఓటెయ్యాలట!
- ఈసీ నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలు
- ఇప్పటికే నిప్పుల కొలిమిలా రాష్ట్రం
- ఆందోళనలో అభ్యర్థులు, పార్టీలు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): ఇప్పటికే తెలంగాణ నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటి దడపుట్టిస్తున్నాయి. వచ్చేది అసలే మే నెల!. ఎండలు ఎట్లుంటయో ఊహించుకుంటేనే వెన్నులో వణుకు పుడుతున్నది. ఈ తరుణంలో ఎండలు మండే మే నెల మధ్యలో జరిగే లోక్‌సభ పోలింగ్ కోసం ప్రజలకు వెసులుబాటు ఇవ్వాల్సిందే పోయి, తెలంగాణపై కేంద్ర ఎన్నికల సంఘం వివక్ష చూపుతున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈశాన్య రాష్ట్రాలు మినహా అన్ని రాష్ట్రాల్లో సాయంత్రం 6 గంటల దాకా పోలింగ్ సమయం ఇవ్వగా, తెలంగాణలో మాత్రం మే 13న సాయంత్రం 5 గంటల వరకే సమయమిచ్చింది. మిట్టమధ్యాహ్నం పోలింగ్ మందకొడిగా ఉంటుందని, సాయంత్రం సమయం కేటాయిస్తేనే ఓటర్లు కేంద్రాలకు వస్తారని, ఈసీ నిర్ణయంతో రాష్ట్రంలో ఓటింగ్ శాతం తగ్గే ప్రమాదముందని అటు రాజకీయ పార్టీలు, ఇటు అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది. అన్ని రాష్ట్రాల మాదిరిగా ఇక్కడా సాయంత్రం 6 గంటల వరకు సమయం ఇవ్వాలన్న డిమాండ్ వినిపిస్తున్నది.

ఇప్పటికే రెడ్ అలర్ట్

రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఇప్పటికే వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ బయటకు రావొద్దని స్పష్టంగా చెబుతున్నది. ఉదయం 7 గంటల నుంచే ఎండ తీవ్రత మొదలై మధ్యాహ్నం వరకు ముచ్చెమటలు పట్టిస్తున్నది. ఏప్రిల్‌లోనే ఇంత తీవ్రత ఉంటే మేలో ఎలా ఉంటుందోననే ఆందోళన రాజకీయ పార్టీలు, అభ్యర్థుల్లో నెలకొన్నది. ఉదయం ప్రచారానికి ప్రజలు ముందుకురాకపోవడం వల్లే సాయంత్రం వేళ నిర్వహిస్తున్నామని, ఇక పగలు జరిగే పోలింగ్‌కు ఓటర్లు ఎలా వస్తారని ప్రశ్నిస్తున్నారు. ఓటర్లకు సహకరించి పోలింగ్ శాతాన్ని పెంచాల్సిన ఎన్నికల సంఘం, ఇలాంటి నిర్ణయం తీసుకోవడం తెలంగాణపై వివక్షేనని ఆరోపిస్తున్నారు.

అసలే పట్టణవాసులు!

తెలంగాణలో పట్టణ ప్రాంతాలు ఎక్కువ. ఇక్కడి పట్టణవాసులు ఓటేసేందుకు ముందుకురారనే అపవాదు కూడా ఉంది. ఇక మిట్ట మధ్యాహ్నం పట్టణాల్లో పోలింగ్ సరళి ఎలా ఉంటుందో చెప్పనవసరం లేదు. దేశంలో 2019లో 50 శాతం కంటే తక్కువ పోలింగ్ నమోదైన పార్లమెంట్ నియోజకవర్గాలు చూస్తే మన రాష్ట్రం నుంచే నాలుగు హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజ్‌గిరి, చేవెళ్ల ఉన్నాయి.

ఇక్కడా సమయం పెంచాల్సిందే

సాయంత్రం 5 గంటలు దాటితేగాని, కొంత ఎండ తీవ్రత తగ్గడంలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 5 గంటల వరకే సమయం ఇస్తే ఓటేసేందుకు ప్రజలు ఆసక్తి చూపరని, ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లాల్సిన వారు అసలే ముందుకురారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఈసీ పునఃసమీక్షించుకొని మిగతా రాష్ట్రాల్లానే తెలంగాణలోనూ ఆరు గంటల వరకు ఓటేసేందుకు అవకాశం ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

నక్సల్స్ ప్రభావమున్న ఛత్తీస్‌గఢ్‌లోనూ సాయంత్రం 6 వరకు

దేశంలో ప్రస్తుతం నక్సల్స్ ప్రభావం ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా ఛత్తీస్‌గఢ్ గుర్తింపు పొందింది. అలాంటి ప్రాంతంలో సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్‌కు సమయం ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ 6 గంటల వరకు అనుమతినిచ్చారు. తెలంగాణ చుట్టు పక్కల అన్ని రాష్ట్రాల్లోనూ 6 గంటల వరకు సమయాన్నిచ్చి తెలంగాణలో 5 గంటలకే ముగించాలనడంపై పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా మండిపడుతున్నాయి.

పాక్ ఉప ప్రధానిగా ఇషాక్ దార్ నియామకం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ (73) ఆదివారం ఆ దేశ ఉప ప్రధానమంత్రిగా నియమితులయ్యారు. ఆయన ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పార్టీ పీఎంఎల్ -ఎన్‌కు చెందిన నేత. ఆయనను షరీఫ్ ఉప ప్రధానిగా నియమించినట్లు కేబినెట్ డివిజన్ విడుదల చేసిన నోటిఫికేషన్ తెలిపింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని, తదుపరి ఉత్తర్వులు జారీ అయ్యే వరకు కొనసాగుతాయని వివరించింది. షరీఫ్, దార్ ప్రస్తుతం సౌదీ అరేబియాలో పర్యటిస్తున్నారు. ప్రధాని షరీఫ్ సోదరుడు నవాజ్ షరీఫ్ కుమార్తెను దార్ కుమారునికి ఇచ్చి వివాహం చేశారు. దీంతో ఈ రెండు కుటుంబాల మధ్య బంధుత్వం ఉంది. ఆర్థిక మంత్రిగా దార్‌కు ఆయన పార్టీలో మంచి పేరు ఉంది. అయినప్పటికీ షెహబాజ్ షరీఫ్ ఈసారి ఆయనకు విదేశాంగ శాఖను అప్పగించడం అందరినీ ఆశ్చర్యపరచింది.

రేవంత్ బీజేపీలో చేరడం ఖాయం

- తెలంగాణలో మా పార్టీని అడ్డుకున్నది కేసీఆరే
- మమ్మల్ని ఆపడం కాంగ్రెస్‌తో అయ్యేపనికాదు
- బీజేపీ ఎంపీ అర్వింద్ సంచలన వ్యాఖ్యలు

నిజామాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ వేల్పూర్: సీఎం రేవంత్‌రెడ్డి త్వరలో తమ పార్టీలో చేరడం ఖాయమని బీజేపీ ఎంపీ అర్వింద్ మరోమారు స్పష్టం చేశారు. ఏబీవీపీ నుంచి వచ్చిన రేవంత్ రేపోమాపో బీజేపీలో చేరిపోతారని పుకార్లు వినిపిస్తున్నాయని పేర్కొన్నారు. అందుకే చాలాచోట్ల కాంగ్రెస్ నుంచి డమ్మీ అభ్యర్థులను నిలబెట్టినట్టు తెలుస్తున్నదని చెప్పారు. ఆదివారం నిజామాబాద్ జిల్లా వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన బీజేవైఎం కార్యకర్తల సమావేశంలో అర్వింద్‌పై వ్యాఖ్యలు చేశారు. దేశం మొత్తం మీద కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవుతున్నదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో కూడా రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌ను ఖాళీ చేసి బీజేపీలోకి వస్తారని స్పష్టం చేశారు. పరోక్షంగా రేవంత్‌రెడ్డి బీజేపీకే మద్దతు పలుకుతున్నారని ప్రకటించారు. అలాంటప్పుడు ఇంతటి ఎండలో ఎన్ని కలెందుకని ప్రశ్నించారు. బీజేపీని నియంత్రించడం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే సాధ్యమైందని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ బలం పెరగకుండా కేసీఆర్ మాత్రమే కంట్రోల్ చేశారని, కాంగ్రెస్ వాళ్లు ఎక్కడా బీజేపీని అడ్డుకోలేకపోయారని తెలిపారు. ఎన్నారైల మీద కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డికి ఎక్కడాలేని ప్రేమ పుట్టుకొచ్చిందని, 45 ఏండ్ల రాజకీయ జీవితంలో ఆయన ఒక్కసారి కూడా ఎన్నారైల గురించి మాట్లాడలేదని మండిపడ్డారు. అలాంటి వ్యక్తి రాష్ట్ర ప్రభుత్వంతో ఎన్నారైల సంక్షేమ బోర్డును పెట్టిస్తానని అంటున్నాడని విమర్శించారు. చక్కెర ఫ్యాక్టరీలు జీవన్‌రెడ్డి కారణంగానే మూతపడ్డాయని, లోక్‌సభ ఎన్నికల్లో ఆయన్ను గెలిపిస్తే వాటిని తెరిపిస్తామంటున్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నారైల సంక్షేమ బోర్డు, ఫ్యాక్టరీల పునరుద్ధరణ అంశాలు రాష్ట్ర పరిధిలోనివని, వాటికి లోక్‌సభ ఎన్నికలతో సంబంధమేంటని ప్రశ్నించారు. జిల్లాకు వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను తెచ్చి, జక్రాన్‌పల్లి వద్ద ఎయిర్‌పోర్టును ఏర్పాటు చేయించి కనీసం పదివేల మంది ఎన్నారైలను వాపస్ తీసుకురాకపోతే తన పేరు మార్చుకుంటానని, ఈసారి ఇదే తన బాండ్ పేపర్ అని అర్వింద్ స్పష్టం చేశారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
నల్లగొండ	45.5°c	32.8°c
ఆదిలాబాద్	44.8°c	26.2°c
ఖమ్మం	44.0°c	28.0°c
మెదక్	43.5°c	23.5°c
నిజామాబాద్	43.0°c	30.4°c
రంగారెడ్డి	42.9°c	21.3°c
మహబూబ్‌నగర్	42.7°c	30.2°c
కరీంనగర్	42.0°c	28.0°c
వరంగల్	42.0°c	28.0°c
హైదరాబాద్	41.8°c	28.7°c

నిప్పుల కుంపటిలా రాష్ట్రం

- 6 జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఎండలు
- అన్ని జిల్లాలూ ఆరెంజ్ జోన్‌లోనే
- 15 మండలాలు రెడ్ జోన్‌లోనే
- అప్రమత్తంగా ఉండాలన్న నిపుణులు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో భానుడి ప్రతాపం బెంబేలెత్తిస్తున్నది. ఎన్నికల వేళ రాజకీయ పార్టీల పోటాపోటీ ప్రచార హోరుతో కళకళలాడాల్సిన రాష్ట్రం.. సూర్యుడి ప్రకోపానికి మధ్యాహ్నం పూట దాదాపు నిర్మానుష్యంగా మారుతున్నది. 42-45 డిగ్రీ సెంటిగ్రేడ్ మధ్య నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుత